క్లుప్తంగా

భక్త కనకదాస జయంత్యుత్సవం



కనకదాస చిత్రపటానికి పూజలు చేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని జీడిపల్లిలో ఆదివారం భక్త కనకదాస జయంత్యుత్సవాన్ని కురుబలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన భక్త కనకదాస చిత్రపటానికి కలశాలను సమర్పించి, గొరవయ్యలతో పాలు పోయిస్తూ పూజలు చేపట్టారు. అనంతరం ట్రాక్టర్‌లో కనకదాస చిత్రపటంతో కురుబలు మంగళవాయిద్యాలు, డప్పుల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు.

గుడికట్ల సంబరాలను జయప్రదం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న కురుబ సంఘం నాయకులు

ఉరవకొండ: కురుబల గుడికట్ల సంబరాలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు కోరారు. సోమవారం స్థానిక గుంతకల్లు రోడ్డు వద్ద ఉన్న కురుబ సంఘం తాలుకా కార్యాలయంలో గుడికట్ల సంబరాల కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లను రాష్ట్ర, జిల్లా నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా కురుబ సంఘం మండలాధ్యక్షుడు చేజాల నాగరాజు, పట్టణ అధ్యక్షుడు ఆకుకూర నాగరాజు, నాయకులు చెన్నప్ప, లాలెప్పతో కలసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19న అనంతపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగే రాష్ట్రస్థాయి గుడికట్ల సంబరాలకు జిల్లా నలుమూలల నుంచి కురుబ కులస్తులు తరలిరావాలన్నారు. సంఘం నాయకులు చాబాల ఈశ్వరయ్య, హనమంతప్ప, గుజెప్ప, రమేష్, బసవరాజు, గోపాల్, బాలకుంట శంకర్, వీరన్న పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



రుద్రంపల్లిలో బోనాలు మోసుకెళ్తున్న మహిళలు

కుందుర్పి: మండలంలోని మలయనూరు, తమ్మయ్యదొడ్డి గ్రామాల్లో ఆదివారం వాల్మీకి జయంతి ఉత్సవాలను బోయలు ఘనంగా నిర్వహించారు. సోమవారం రుద్రంపల్లిలో వాల్మీకి చిత్రపటాన్ని గ్రామోత్సవం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో వాల్మీకుల హక్కుల సాధనకు చేపట్టాల్సిన చర్యలపై సంఘం నాయకులు వివరించారు.

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక




ఎంపికైన కిరణ్

ఉరవకొండ: జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఉరవకొండ పట్టణంలోని ఎస్కే ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థి కిరణ్ ఎంపికైనట్లు సీనియర్ బాస్కెట్‌బాల్ కోచ్‌లు ఖలందర్, ఎర్రిస్వామి సోమవారం తెలిపారు. మూడు రోజుల క్రితం మదనపల్లిలో జరిగిన అండర్–14 రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో కిరణ్ ప్రతిభ చూపి జాతీయస్థాయిపోటీలకు ఎంపికయ్యాడన్నారు.

వ్యక్తికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ సమీపంలోని కృషి విజ్ఞాన కేంద్రం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. వివరాలు...కంబదూరు మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన నరేష్, ఆదివారం కళ్యాణదుర్గంలోని బంధువులకు పెళ్లి కార్డులు ఇవ్వడానికి బయలుదేరాడు. పట్టణ సమీపంలోని కృషి విజ్ఞాన కేంద్ర దగ్గరకు బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. గాయపడ్డ అతడిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు అనంతపురం తరలించారు.

డ్రైనేజీ నిర్మాణం ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని కొత్తిండ్లు కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. సమస్యను స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు మంత్రి ఉషశ్రీ చరణ్ దృష్టి తీసుకెళ్లడంతో.. వెంటనే ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కింద రూ.2లక్షల నిధులు వెచ్చించి డ్రైనేజీ ఏర్పాటు చేయాలని సూచించారు. సోమవారం ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, జిన్నా మల్లి, అయ్యన్న డ్రైనేజీ నిర్మాణానికి జేసీబీతో పనులు ప్రారంభించారు. పనులు ప్రారంభించడంతో కాలనీవాసులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటింటా దీపావళి కాంతులు

- అంబరాన్నంటిన సంబరాలు



రాయదుర్గంలో చిచ్చుబుడ్లు కాలుస్తున్న చిన్నారులు



కళ్యాణదుర్గం: నాయకులతో కలిసి దీపావళి సంబరాలు జరుపుకుంటున్న మంత్రి దంపతులు



రాయదుర్గం: లక్ష్మీపూజలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

కళ్యాణదుర్గం/రాయదుర్గం/రాయదుర్గంటౌన్/బొమ్మనహాళ్/కంబదూరు/కూడేరు/వజ్రకరూరు/కణేకల్లు: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో దీపావళి పండుగ కోలాహలంగా జరిగింది. ఆదివారం అమావాస్య కావడంతో పండగను భక్తులు సందడిగా జరుపుకున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో చిన్నారులు, యువకులు పండుగను సందడిగా జరుపుకున్నారు. ఇష్టదైవం అయిన లక్ష్మీదేవి, ఇతర దేవతల ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపి మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ బెంగుళూరులోని ఆమె నివాసంలో దీపావళి పండుగను జరుపుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి సమీపంలోని లక్ష్మీదేవి, ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. అలాగే రాయదుర్గంలో ప్రభుత్వ విప్ కాపు ఇంట దీపావళి సందడి అంబరాన్నంటింది. సతీమణి కాపు భారతి, కుమారుడు ప్రవీణ్‌రెడ్డి, కోడలు అలేఖ్యరెడ్డి, కుమార్తె స్రవంతిరెడ్డితో కలసి స్వగృహంలో నిర్వహించిన లక్ష్మీపూజ ఆకట్టుకుంది. వర్షాలు సంవృద్ధిగా కురిసి, ప్రజలంతా సుఖ, సంతోషాలు కలిగి ఉండేలా లక్ష్మీదేవి దీవెనలు అందించాలని మొక్కుతీర్చారు. అలాగే రాయదుర్గం పట్టణంలోని పలు వ్యాపార దుకాణాల్లో యజమానుల ఆహ్వానంతో లక్ష్మీపూజకు హాజరై ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరై మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా బొమనహాళ్, కూడేరు, కంబదూరు, వజ్రకరూరు, కణేకల్లు మండలాల్లో దీపావళి సందర్భంగా ఇళ్ల వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. పిల్లలు, యువత టపాసులు కాల్చుకుంటూ కేరింతలతో ఆనందంగా గడిపారు. తారాజువ్వలు , రంగురంగుల చిచ్చుబుడ్లు, భూచక్రాలతో పాటు టపాసులు కాల్చారు. మహిళలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేటి నుంచి 'కార్తీకం' ప్రారంభం



తొలి పూజలకు సిద్ధమైన నీలకంఠేశ్వరుడు

రాయదుర్గం: శివ కేశవులకు ఎంతో ప్రీతికరమైన కార్తీక మాసం మంగళవారం (నవంబర్ 14) నుంచి ప్రారంభం కానుంది. డిసెంబర్ 13 వరకూ కొనసాగే ఈ మాసంలో దీపారాధనకు విశేష ప్రాధాన్యం ఉంది. అన్నీ ఆలయాలు, నదీతీరాలు, ఇళ్లల్లో సైతం దీపాలను వెలిగించడం పుణ్యప్రదమని కార్తీక పురాణం చెబుతోంది. దీపదర్శనం , దీపదానం, దీప ప్రకాశనం అనే మూడు ఈ మాసంలో ఎంతో పుణ్యాన్నిస్తాయని భక్తులు విశ్వసిస్తారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రాలన్ని కార్తీక సందడికి సిద్ధమయ్యాయి. సోమవారం, ఏకాదశి, శనివారంతో పాటు ఈ నెల రోజులూ పుణ్య దినాలేనని అర్చకులు చెబుతున్నారు. కార్తిక శుద్ధ పాడ్యమికి బలి పాడ్యమి అని పేరు. ఈ రోజున బలిచక్రవర్తిని పూజించి దానం చేస్తే సంపదలు తరగవని చెబుతారు. ఈ మాసంలో దీపారదనే అత్యంత కీలకం. నదీ స్నానం, దానధర్మాలు, ఉపవాసాలు, పూజలు, వ్రతాలు, నోములకు ఈ మాసంలో ఎంతో ప్రాధాన్యం ఉంది. దీని వల్ల కష్ట నష్టాలు పోవడంతో పాటు పాపాలు తొలగిపోతాయని పెద్దలు చెబుతారు.

అభివృద్ధిని ప్రశ్నించడం టీడీపీకి సిగ్గుచేటు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బొమ్మనహాళ్: రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనను ప్రశ్నించడం టీడీపీకి సిగ్గుచేటని పార్టీ మండల కన్వీనర్ మచ్చన్న, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాస్, బొమ్మనహాళ్ సహకార సంఘ అధ్యక్షుడు శివలింగప్ప అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించడాన్ని ఖండించారు. మండల వ్యాప్తంగా సుమారు.400 కోట్ల నిధులతో విద్య, వైద్యం, గృహకల్పన రోడ్డు నిర్మాణ పనులు, ప్రభుత్వ కార్యాలయాలు కార్పొరేట్ తరహా పాఠశాలల నిర్మాణ పనులు జరిగినా పచ్చ కళ్లకు కనపడకపోవడం సిగ్గు చేటన్నారు. ప్రజా సమస్యలను టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఏనాడూ పట్టించుకోలేదని , వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి నిత్యం ప్రజల్లోనే ఉంటారని గుర్తు చేశారు. రైతులకు పరిహారం ఇవ్వకుండా హంద్రీనీవా 36వ ప్యాకేజీ కాలువ పనులను గతంలో టీడీపీనే చేపట్టిందన్నారు. మండల టీడీపీ నాయకులు హంద్రీనీవా కాలువ పనులను వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అడ్డుకున్నారంటూ పేర్కొనడం తగదన్నారు. వారి చేతకానితనం, తప్పిదాన్ని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, రైతులపై వేయడం టీడీపీకే చెల్లు అన్నారు. టీడీపీ పాలనలో రైతుల భూములకు, సాగు చేసిన పంటలకు పరిహారం ఇవ్వకుండా పనులు ముందుకు సాగకుండా హంద్రీనీవాను పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. మండలంలోని అన్ని చెరువులతో పాటు 30వేల ఎకరాలకు సాగునీరును అందించే ప్రక్రియకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు కరుణాకర్, గురుమూర్తిరెడ్డి, పార్టీ మండల జనరల్ సెక్రటరీ రామేశ్వరరెడ్డి, పార్టీ బీసీ ఎల్ మండల ఉపాధ్యక్షుడు పురుషోత్తంరాజు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు తిప్పేస్వామినాయక్, సేవాదళ్ మండల కన్వీనర్ తిమ్మారెడ్డి, ఉప సర్పంచ్ పాతన్న, బీసీ సెల్ నాయకుడు అంగడి ఎర్రిస్వామి, నాయకులు నరసింహారెడ్డి, బాబురెడ్డి, సుంకానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుకాసురుడు కాలవ శ్రీనివాసులు

- మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్ మండిపాటు



రాయదుర్గం: టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు ఇసుకాసురడని రాయదుర్గం మార్కెట్‌యార్డ్ చైర్మన్ బోజరాజ్‌నాయక్ విమర్శించారు. సోమవారం డి.హీరేహాళ్ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు.. టీడీపీ హయాంలో మంత్రి పదవిని అడ్డుపెట్టుకుని ఒక్క ఇసుక, మట్టిలోనే కాలవ రూ.వందల కోట్లు దోపిడీ చేశాడని ఆరోపించారు. ఈ వాస్తవాన్ని అప్పట్లో తన మానస పుత్రికగా చెప్పుకునే ఈనాడులోనే ×మంత్రి ఇలాకాలో కంత్రీల కులాసా× అంటూ ప్రచురించిన కథనాన్ని గుర్తుచేశారు. ఈ విషయంపై అప్పట్లో కాలవ ప్రజల్లో భారీ వ్యతిరేకత మూట కట్టుకున్నారని, ఆ నిందను విప్ కాపు రామచంద్రారెడ్డికి ఆపాదిస్తూ తనపై పడిన అవినీతి ముద్ర చెరిపేలా గడిచిన నాలుగేళ్లుగా కాలవ చేయని ప్రయత్నామంటూ లేదని ధ్వజమెత్తారు. రెండు రోజుల క్రితం జుంజురంపల్లి వద్ద ఇసుక రవాణా చేస్తూ 17 టిప్పర్లు పట్టుబడితే వాస్తవాలు తెలుసుకోకుండా కాపు రామచంద్రారెడ్డికి అంటగట్టేలా సెల్ఫీరాజా లేనిపోని ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇటీవల ఓబుళాపురం వద్ద ఇసుక టిప్పర్ పట్టుబడితే దాన్ని కూడా విప్ కాపుతో పాటు మా అందరికీ అంటాగట్టాడన్నారు. తీరా చూస్తే ఆ టిప్పర్ ఓబుళాపురం టీడీపీ కార్యకర్తదిగా తేలిందన్నారు. ఇలా నోరు తెరిస్తేచాలు అపద్దాలు మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు. ఇసుక దోపిడీని అధికారులు అడ్డుకుంటే నిందలేస్తావా..? నిజాయితీగా కేసులు నమోదు చేసిన ఘనత మా ప్రభుత్వానిదన్నారు. నీవు మంత్రిగా ఉండే రోజుల్లో ఇసుక, మట్టి వ్యవహారాల్లో డి హీరేహాల్ వద్ద తహసీల్దార్ పట్టుకుంటే బెదిరించి విడిపించిన మాటా వాస్తవం కాదా..? అంటూ నిలదీశారు.

విప్‌పై దుష్ప్రచారం చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోండి

కణేకల్లు: రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డిపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వెట్ట అంజిబాబుపై చర్యలు తీసుకోవాలని మండల వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్లు హంపి, ఉదయ్, శివయ్య, లోకేష్‌రెడ్డి కణేకల్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాయదుర్గం మండలంలోని జుంజరంపల్లి ఇసుకరీచ్‌లో మైనింగ్ అధికారులు స్వాధీనం చేసుకొన్న టిప్పర్ల గురించి పెనకలపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వెట్ట అంజిబాబు విప్ కాపును నోటికొచ్చినట్లు మాట్లాడటంపై సోషల్ మీడియా కన్వీనర్లు మండిపడ్డారు. విప్ కాపు మనోభావాలు దెబ్బతినేలా అంజిబాబు మాట్లాడాడని ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలాంటి పనులు ఎవరూ చేస్తారో అందరికీ తెలిసిందేనన్నారు. చీప్ ట్రిక్స్‌తో ప్రభుత్వ విప్‌పై లేనిపోనివి అంటగట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని తగిన బుద్ధి చెబుతారని, ఇకనైనా నీచరాజకీయాలు చేయడం మానుకోవాలని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులును వైఎస్సార్‌సీపీ సోషల్‌మీడియా కన్వీనర్లు హెచ్చరించారు.

తాగునీటి బోరు ఏర్పాటు

బొమ్మనహాళ్: మండలంలోని శ్రీధరఘట్టలో ఉన్న జగనన్న లేఅవుట్ కాలనీలో ఎంపీపీ పద్మ, సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ యోగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తాగునీటి బోరును ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ జగనన్న కాలనీలో 139 ఇళ్లు మంజూరయ్యాయని, 50 ఇళ్లకు పైగా నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. కాలనీవాసులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా బోరుకు మోటారు ఏర్పాటు చేసి నీటిని వదిలారు. అడిగిన వెంటనే జగనన్న కాలనీలో బోరు వేయించిన ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.



మోటారు ఆన్ చేస్తున్న సీనియర్ నేత చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ యోగేశ్వరరెడ్డి

గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయండి

ఉరవకొండ: 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఉరవకొండ ప్రధాన గ్రంథాలయ అధికారి ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమ, కార్యదర్శి రమ ఆదేశాల మేరకు నవంబర్ 14 నుంచి 20 వరకూ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. నవంబర్ 14న ప్రారంభ వేడుకలు, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ సెమినార్, 17, 18న విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు, 20న గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు హజరుకావాలని ఆయన కోరారు.
వజ్రకరూరు: గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయాలని గ్రంథాలయ అధికారి ము నెమ్మ సూచించారు.సోమవారం మండల కేంద్రంలో 56వ గ్రంథాలయ వారో త్సవాల గోడపత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మహాబూబ్‌బాషా, గ్రామపెద్దలు మన్యం ప్రకాష్, మల్లికార్జున, విద్యార్థులు పాల్గొన్నారు.
కణేకల్లు: మండల కేంద్రంలో ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి వన్నూరుస్వామి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడి దుర్మరణం

రాయదుర్గం టౌన్: గోడ కుప్పకూలడంతో శిథిలాల కింద చిక్కుకుని ఓ భవన నిర్మాణ కార్మికుడు దుర్మరణం పాలయ్యాడు. వివరాలు... రాయదుర్గంలోని మొలకాల్మూరు రోడ్డు చెక్‌పోస్టు వద్ద నివాసముంటున్న నాయకుల రాజా (48) భవన నిర్మాణ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. భార్య, కుమార్తె ఉన్నారు. ఆదివారం ఉదయం స్థానిక సిండికేట్ బ్యాంక్ వెనుక వీధిలో పాత భవనాన్ని కూలదోసే పనుల్లో నిమగ్నమై ఉండగా ఉన్నఫళంగా గోడ కుప్పకూలింది. శిథిలాల కింద చిక్కుకున్న రాజాను స్థానికులు వెలికితీసే లోపు మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పోలీసుల ఆధ్వర్యంలో అన్నదానం



కళ్యాణదుర్గం: విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న పట్టణ సీఐ హరినాథ్

కళ్యాణదుర్గం: దీపావళి పండుగను పురస్కరించుకుని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు స్థానిక ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాల్లో విద్యార్థులకు పోలీసులు అన్నదానం చేశారు. పట్టణ సీఐ హరినాథ్, ఎస్ఐ యువరాజ్, సిబ్బందితో కలసి సోమవారం కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులు సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు చదవాలని సీఐ ఆకాంక్షించారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలకు పుస్తకాలు, బ్యాగుల పంపిణీ

ఉరవకొండ: ప్రపంచ అనాథల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉరవకొండలోని చిన్నపిల్లల అనాథాశ్రమంలో సోమవారం ఎస్ఐ వెంకటస్వామి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అనంతరం 30 మంది అనాథ పిల్లలకు ఆశ్రమ వ్యవస్థాపకుడు ఫాస్టర్ సురేష్‌తో కలిసి ఎస్ఐ పుస్తకాలు, బ్యాగులు, పఠన సామగ్రి అందించారు.
బ్రహ్మసముద్రం: జిల్లా ఎస్పీ అనురాజన్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహంలో దీపావళి పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎస్ఐ పరుశురాముడు స్వీట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరాలన్నారు.
కుందుర్పి: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం ఎస్ఐఎరిస్వామితో పాటు సిబ్బంది కుందుర్పిలో ఎస్కే చారిటబుల్ ట్రస్టు నిర్వహిస్తున్న విలువల బడిలో దీపావళి పండుగను నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్కే చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు లెనిన్ బాబు, సభ్యులు జగదీష్, రాజు, ఉమాదేవి, యశోద, శ్రీకాంత్, దిలీప్, విద్యార్థులు పాల్గొన్నారు.
కూడేరు: మండలంలోని గొటుకూరులోని బెరాక వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సోమవారం పోలీసులు పండ్లు, తినుబండారాలను అందజేశారు కార్యక్రమంలో ఎస్ఐ సత్యనారాయణ, హెడ్‌కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు, వసీం అక్రమ్, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడిపై కేసు నమోదు

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ కేశప్పపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ శివ మంగళవారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. ఈ నెల 10న దర్గాహొన్నూరులో ఆంధ్రకు జగనే ఎందుకు సీఎం కావాలి అనే కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు మనోహర్‌శెట్టి గత టీడీపీ పాలనలో దర్గాహొన్నూరు గ్రామంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, దర్గా ఆవరణలో ఉన్న స్థలాలను టీడీపీ నాయకులు అమ్ముకున్నారని ఆరోపించారు. అదే రోజు రాత్రి సమయంలో టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ కేశప్ప మద్యం సేవించి వైఎస్సార్‌సీపీ నాయకుడు మనోహర్‌శెట్టి ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి మనోహర్‌శెట్టి, కుటుంబ సభ్యులపై దుర్భాషలాడాడు. అతడి ఫిర్యాదు మేరకు కేశప్పపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

జూదరుల అరెస్టు

బ్రహ్మసముద్రం: మండలంలోని పాలవెంకటాపురం కొండ సమీపంలో పేకాట స్థావరంపై సిబ్బందితో కలసి ఎస్ఐ పరుశు రాముడు సోమవారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఆరుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.9 వేల నగదు, 8 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.
బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు. వారి నుంచి 2,600 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

ఉరవకొండ: సచివాలయాల్లో మంగళవారం నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం ప్రారంభం అవుతుందని పార్టీ పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, మండల సమన్వయకర్త మూలగిరిపల్లి ఓబన్న సోమవారం తెలిపారు. ఈ నెల 14న సచివాలయం–1, 15న సచివాలయం–2, 16న సచివాలయం–3, 17న సచివాలయం–4లో కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డులను ఆవిష్కరించడంతోపాటు పార్టీ జెండా ఆవిష్కరిస్తామన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారులు, హాజరు కావాలన్నారు.
కూడేరు: 'వై ఏపీ నీడ్స్ జగన్ ' కార్యక్రమాన్ని మంగళవారం కూడేరు సచివాలయం–2 పరిధిలోని కడదరకుంట గ్రామంలో నిర్వహించనున్నట్లు ఎంపీపీ నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు తుప్పటి అశ్వని, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి సోమవారం తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, వలంటీర్లు, గృహసారథులు, జేసీఎస్ కన్వీనర్లు, పార్టీ నేతలు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.
బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామాంజనేయులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు సచివాలయం–1 పరిధిలో నిర్వహించే కార్యక్రమానికి ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి హాజరవుతున్నారన్నారు. ప్రజలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.
రాయదుర్గం రూరల్: మండలంలోని బొంద నకల్లు (రాతిబావివంక) గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్, జెడ్పీటీసీ హొన్నే మల్లికార్జున, ఎంపీపీ విద్యావతి, ఎంపీడీఓ కొండయ్య సోమవారం తెలిపారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, వలంటీర్లు , గృహసారథులు హాజరు కావాలని వారు కోరారు.

15న 'జగనన్నకు చెబుదాం'

వజ్రకరూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం కలెక్టర్ ఆదేశాల మేరకు 'జగనన్నకు చెబుదాం కార్యక్రమం' నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలలిత సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. కార్యక్రమానికి సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

సంక్షిప్త సమాచారం

నేడు వాహనాల వేలం

రాయదుర్గం రూరల్: అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో మంగళవారం వేలం వేయనున్నట్లు సీఐ లక్ష్మణ్ణ తెలిపారు. ఉదయం 10 గంటలకు 12 మోటార్ సైకిళ్లు , ఒక కారు వేలం వేస్తామన్నారు.

మండల సమావేశం రేపు

బొమ్మనహాళ్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసిన్నట్లు ఎంపీపీ యు. పద్మ, ఎంపీడీఓ షకీలాబేగం సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు హాజరు కావాలన్నారు.

ఆర్థికసాయం అందజేత

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని బోరంపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న మహేంద్ర వ్యక్తికి సోమవారం టీచర్ బద్దేనాయక్ ఆర్థికసాయం చేశారు. సోమవారం ఆయన బాధితుడికి సుమారు రూ.12,000 విలువ చేసే మందులతో పాటు, 5,000 నగదు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమశేఖర్‌రెడ్డి, మీసేవ బాబు, రామాంజనేయులు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చిరుత దాడిలో జీవాల మృతి

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని ఈస్ట్ కోడిపల్లిలో ఆదివారం తెల్లవారుజామున చిరుత దాడిలో నాలుగు మేకలు మృతి చెందాయి. వివరాలు.. వెంకటేశులు, కృష్ణప్ప రోజు లాగే మేపు అనంతరం సాయంత్రం ఇంటి సమీపంలోని దొడ్డిలో రాత్రి జీవాలను ఉంచారు. ఆదివారం ఉదయం చూడగా నాలుగు మేకలు మృతి చెందాయి. చిరుత దాడి చేసిందని నిర్ధారించుకుని అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. మృతి చెందిన మేకల్లో మూడు కృష్ణప్ప చెందినవి కాగా ఓ మేక వెంకటేశులుది.
కుందుర్పి: మండలంలోని కెంచంపల్లిలో రెండు గొర్రెలను చిరుత చంపినట్లు బాధిత రైతు ఈరన్న వాపోయాడు. పొలాల్లో మేతకు వెళ్లిన సమయంలో గొర్రెలపై చిరుత దాడి చేసిందన్నారు. పశు వైద్యుడు ప్రసాద్ గొర్రెలకు పంచనామా నిర్వహించారు. గొర్రెల విలువ రూ.20 వేలు ఉంటుందని రైతు తెలిపాడు.

కేబుల్ చోరీపై ఫిర్యాదు

వజ్రకరూరు: మండలంలోని తట్రకల్లు, కొనకొండ్ల గ్రామ పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మకంలను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి అందులో ఉన్న అల్యూమి నియం కేబుల్ చోరీ చేశారని ట్రాన్స్‌కో ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉరవకొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అలాగే పొలంలో ఇటీవల స్ప్రింక్లర్లు, పైపులు చోరీకి గురయ్యాయని రాగులపాడుకు చెందని రైతు రవీంద్ర ఫిర్యాదు చేశాడన్నారు. చోరీకి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకుంటామని ఆయన తెలిపారు.

వృద్ధుడి మృతి

కూడేరు: మండలంలోని పి.నాగిరెడ్డిపల్లికి చెందిన ఓబులప్ప(65) కుటుంబ సమస్యలతో ఈ నెల 11న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.